క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



విద్యార్థులకు దుస్తులు, టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. మంగళవారం మండలంలోని తూర్పు పూలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థి పాతులోతు అమర్‌సింగ్ డ్రస్‌లు, టై, బెల్టులు, ఐడీ కార్డులను అందించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలు అందరూ ఈ పాఠశాలలో చదవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.కవిత, ఉపాధ్యాయుడు శిగ మహేష్, నవోదయ విద్యాలయం గణిత ఉపాధ్యాయుడు అమరలింగాచారి పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ నోముల యాదగిరి

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉద్యోగ విరమణ సన్మానం కార్యక్రమం మంగళవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి- శ్రీలత దంపతులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. 41ఏళ్లగా ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలందించిన శ్రీనివాస్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నోముల యాదగిరి, పాఠశాల హెచ్‌ఎం సునీత, పీఆర్‌టీయూ నాయకులు ఓరుగంటి శ్రీనివాస్, కాలం నారాయణ రెడ్డి, గౌస్ మొయినుద్దీన్, మధుసూదన్ రెడ్డి, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కోదాటి మధుసూదన్, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నేత పద్మ

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలో బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిమ్మల పద్మ అన్నారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో దేవరకొండ డిపో మేనేజర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత బస్సు నేపథ్యంలో మహిళలకు ప్రయాణాలల్లో ఇబ్బందులు తెలత్తుతున్నాయన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, డిపో పరిధిలోని ముఖ్యమైన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె అధికారులను కోరారు.వినతిపత్రం అందజేసిన వారిలో జ్యోతి, అలివే లు, లక్ష్మమ్మ, సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ మహరాజ్

నాగార్జునసాగర్ : ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి జిల్లా కో ఇన్‌చార్జి సుభాష్ మహరాజ్ అన్నారు. మంగళవారం ధర్మ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయం, పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, భారత రాజ్యాంగంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ సందడి

నూతన సంవత్సర వేడుకలకు ప్రజలు సందడి చేశారు. కేక్‌లు కొనుగోలు చేసేందుకు బేకరీల ఎదుట జనాలు బారులుదీరారు. బిర్యానీ సెంటర్లు, వైన్స్ షాపులు బిజీగా కనిపించాయి. అలాగే పలు పాఠశాలల్లో ముందస్తుగా న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

\- సాక్షి, నెట్‌వర్క్



మిర్యాలగూడ అర్బన్ : కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మిర్యాలగూడ అర్బన్ : ఆటబొమ్మలు, బెలున్లు విక్రయిస్తున్న మహిళ



పెద్దవూర : ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

- 110 కిలోల బెల్లం, 25 లీటర్ల నాటుసారా, 31 ఫుల్ బాటిళ్ల మద్యం పట్టివేత



పట్టుబడిన నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: నాటుసారాకు తయారీకి ఉపయోగించే బెల్లంతో పాటు నాటుసారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను మిర్యాలగూడ ఎక్సైజ్ సీఐ ఎల్. మహేశ్వర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. దామరచర్ల మండలం వాచ్యతండాకు చెంది లావూరి బాలకోటి, దామరచర్లకు చెందిన ఎండీ రెహమాన్, మిర్యాలగూడ పట్టణానికి చెందిన మహంకాళి రాము, త్రిపురారం మండలం పెద్దదేవులపల్లికి చెందిన బలిగా శ్రీను, ఐలాపురం గ్రామానికి చెందిన నూనావత్ రమేష్ నాటుసారా సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం కొండ్రపోల్, ఐలాపురం తండాల శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో వారిని వద్ద నుంచి 110 కిలోల బెల్లం, 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. అదేవిధంగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తెచ్చి అక్రమంగా విక్రయిస్తున్న హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ, నల్లగొండకు చెందిన ప్రవీణ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 31 ఫుల్ బాటిళ్ల మిలటరీ మద్యంతో పాటు రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ లు రాఘవేందర్‌గౌడ్, ఎస్‌కె.పర్విన్, వై.లావణ్య, సిబ్బంది వి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రభువరం, నరేష్, అనిల్‌కుమార్, లతీఫ్, సుభాష్, కరుణాకర్, శ్రీవాణి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్థాయి అధికారిని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్: జిల్లా కావలసిన అన్ని అర్హతలు ఉన్నా.. మిర్యాలగూడను గత ప్రభుత్వం గుర్తించలేదని స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మిర్యాలగూడకు ఎస్పీ స్థాయి అధికారిని నిమించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి మారం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో ఇక్కడి ప్రజలు అనేక ఉద్యమాలు చేశారని కాని గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికే ఐఏఎస్ అధికారిని సబ్‌కలెక్టర్‌గా ఇక్కడ నిమించారని, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఐపీఎస్ అధికారిని సైతం నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దశరథ్ నాయక్, దాసరాజు జయరాజు, సైదులు, అంజయ్య, సతీష్ గౌడ్, నగేష్, మురళి, సైదానాయక్, పాల్గొన్నారు.

త్రిపురారం గ్రామ పంచాయతీని విడదీయొద్దు



ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

త్రిపురారం : ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పంచాయతీలను విడదీయడం సరైంది కాదని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు. త్రిపురారం గ్రామ పంచాయతీ పరిధిలోని జంగాల కాలనీ (దుబ్బమీద) కాలనీని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించడంతో వ్యతిరేకిస్తూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న గ్రామ పంచాయతీని మండల కేంద్రానికి చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు విభజించి పాలించాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజనకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ రైతుబంధు సభ్యులు అనుముల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్, అనుముల శ్యాం సుందర్ రెడ్డి, మజ్జిగపు వెంకట్ రెడ్డి, భైరం కృష్ణ, మైనార్టీ అధ్యక్షుడు దస్తగిరి, నగిరి శ్రీనివాస్, యాదయ్య, సయ్యద్, డానియేల్, శ్రీనివాస్, లక్ష్మణ్, నర్సింహ, అశోక్, కుమ్మరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



త్రిపురారంలో విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంఈఓ రవినాయక్

త్రిపురారం : క్రమ శిక్షణ, పట్టుదలతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలని, చదవుతోనే సమాజంలో తగిన గౌరవం లభిస్తుందని తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంఈఓ రవి నాయక్‌లు అన్నారు. నిడమనూరు మండలంలోని నారమ్మగూడెం గ్రామానికి చెందిన భూమిక రెడ్డి త్రిపురారం మండల కేంద్రంలోని ఆల్ఫా ఉన్నత పాఠశాలో చదువుకుంటుంది. ఆమె డిసెంబర్ 29, 30న కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ చాటి రజత పథకం సాధించింది. అలాగే పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి పథకాలు సాధించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గాజుల ప్రమీలా, ఎంఈఓ రవి నాయక్‌లు జూడో పోటీల్లో పథకాలు సాదించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సలీం, జూడో కోచ్ శ్రీధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ విడుదల చేయాలని హమాలీ కార్మికుల నిరసన

నల్లగొండ టౌన్ : రెండేళ్లకు ఒకసారి జరిగే సివిల్ సప్లయిస్ రేట్ల ఒప్పందం ముగిసి ఏడాది దాటినా పెరిగిన రేట్ల జీఓ విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని సివిల్ సప్లయిస్ గోదాం పాయింట్ వద్ద జరిగిన హమాలీ కార్మికుల నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరిగిన రేట్ల జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొనకొండ వెంకటేశ్వర్లు బుచ్చయ్య, జానయ్య, సైదులు ,శ్రీను, సోమయ్య ఎల్లయ్య, లింగస్వామి, రామస్వామి, యాదయ్య, సోమయ్య, గిరి జాని పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



కొప్పోలులో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గుర్రంపోడు : పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం కొప్పోలు ప్రాథమిక పాఠశాలలో ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదగిరి, మండల పీఆర్‌టీయూ అధ్యక్ష కార్యదరుశలు గౌస్ మొయినుద్దీన్, వద్దిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పిట్టలగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్. యాదయ్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నారాయణ రెడ్డి, జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ అద్దంకి సునీల్ కుమార్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి రెడ్డి, భద్రారెడ్డి యాదయ్య, జయప్రకాశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సునీత పాల్గొన్నారు.

నేటి నుంచి అష్టమ వార్షికోత్సవం ప్రారంభం

డిండి : మండల కేంద్రంలోని శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవాలు బుధ, గురు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చెర్మన్ శ్రీపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, లక్ష్మీ గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామి, నవగ్రహ దేవత సహిత సకల దేవత హోమము, గణపతి, సుబ్రమణ్యస్వామి, శివుడు, వెంకటేశ్వరస్వామికి అభిషేకం, కుంకుమార్చన, లక్ష్మీ పూజ, వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, మహా పడిపూజ తదితర వంటి పూజా కార్యక్రమాలు భక్తులు నిర్వహించనున్నారు. దేవాలయానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెర్మన్ పేర్కొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : అఖిలభారత దళిత హక్కుల పోరాట సమితి రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ లోని ఖైతరాబాదమోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ లో నిర్వహించే మహాసభలకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్వాయి సుందర్, సైదులు, వల్లంపట్ల సుధాకర్, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వాటర్ ఫిల్టర్ బహూకరణ



వాటర్ ఫిల్టర్ బహూకరిస్తున్న ఎల్లయ్య

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని కాల్వలపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం ఆ గ్రామానికి చెందిన జక్కుల ఎల్లయ్య వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమా మాట్లాడుతూ దాతల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి కేంద్రాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు హైమది బేగంతో పాటు పలువురు తండావాసులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామం అభివృద్ధి



పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఐ శ్యాం

అడవిదేవులపల్లి : సమష్టి కృషితోనే గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్, ఆర్ఐ శ్యాం, జూనియర్ అసిస్టెంట్ శ్వేత అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వ హించారు. ఈ సమావేశంలో గ్రామానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలని, వీధి లైట్లు పగిలిపోవడంతో లైట్లు లేక చిమ్మచీకటిగా ఉంటుందని, మంచినీటి ట్యాంకులు శుభ్రంగా లేకపోవడంతో చర్మవ్యాధులు సోకుతున్నాయన్నారు. లైన్‌మెన్ ఫోన్ చేస్తే స్పందించడం లేదని సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. అదే విధంగా గ్రామంలో పేకాట ఆడుతున్న యువకులను హెచ్చరించి పంపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులున్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో దళిత ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడిచేయడం హేయమైన చర్య అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున పేర్కొన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులను పూజించాల్సింది పోయి దాడి చేసి కాళ్లు మొక్కించుకోవడం అనాగరిక చర్య అన్నారు. దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, నరసింహ, బొల్లు రవీందర్, కొండ వెంకన్న, నలపరాజు సైదులు, భిక్షం, రవీందర్, గోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: వ్యవసాయ కార్మికులందరికీ రూ. 12 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు దండంపల్లి సరోజ , బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, గంజి మురళీధర్, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, కొండ వెంకన్న, భూతం కుమారి, మన్నెంభిక్షం, రవీంద్ర కుమార్ , నరసింహ, అంజయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల,పెండ్లిపాకల ప్రాజెక్టుతో పాటు కొత్తగా ప్రతిపాదించిన గాజుబేడం-చిత్రియాల లిఫ్ట్, నేరేడుగొమ్ము మండలం రామనోనిబండ లిఫ్ట్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో విషయ పరిజ్ఞానం



నాగార్జునసాగర్ డ్యామ్ పవర్ జనరేషన్ బ్లాక్ వద్ద కొండమల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

కొండమల్లేపల్లి : క్షేత్ర పర్యటనతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరుగుతుందని కొండమల్లేపల్లి ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు మంగళవారం సాగర్ డ్యామ్‌కు సంబంధించి 815 మెగా వాట్స్ పవర్ జనరేషన్, విద్యుత్ తయారీ విధానం, టార్బైండ్ల పనితీరు తదితర అంశాలపై క్షేత్ర పర్యటనలో పరిశీలించినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లె జనార్దన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాసులు, అశోక్‌కుమార్, శోభారాణి, గీతాంజలి, నరేష్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో 'డామినేషన్ పెట్రోలింగ్'



మిర్యాలగూడ అర్బన్ : నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు మిర్యాలగూడ పోలీసులు మంగళవారం సాయంత్రం డామినేషన్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు వాహనాలతో పట్టణంలోని ప్రధానల వీధితో పాటు పలు సమస్యాత్మక కాలనీల్లో పెట్రోలింగ్ చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలను సురక్షితంగా ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా ఆదేశాల మేరకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేరుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.